శనివారము
శుక్రవారము
గురువారము
బుధవారము
మంగళవారము
సోమవారము

# ఆదివారము నిజముగా పరిశుద్ధమైనదా?

జో క్రూస్

Is Sunday Realy Sacred?
Copyright © 2013, 2025
by Lu Ann Crews

Telugu Translation
Copyright © 2025 by Amazing Facts India

All rights reserved.
Printed in India.

Published by:
**Amazing Facts India**
Post Box No 51
Banjara Hills, Hyderabad
Telangana, 500034

www.AmazingFactsIndia.org

# ఆదివారము నిజముగా పరిశుద్ధమైనదా?

జో క్రూస్

అనువాదం : కొమ్ము కళ్యాణ్

## విషయ సూచిక

తప్పు మలుపు .................................... 2

మూయబడిన మనస్సులు మరియు మెజారిటీ పాలన అను నియమము .................................... 3

ఆదివారమున పునరుత్థానము .................................... 6

నిజమైన విశ్రాంతిదినమును కనుగొనుట .................................... 8

యూదులకు భయపడి .................................... 11

కొరింథులో ఆదివారము ఆచరింపబడలేదు .................................... 13

పౌలు యొక్క దీర్ఘకాల ప్రసంగము .................................... 16

ఐతుకు ఎందుకు సంఘ మేడగది నుండి క్రిందపడెను? .................................... 19

వారు ఆచరించిన దినము .................................... 22

అధ్యాయము 1

# తప్పు మలుపు

**దావీదు** చేసిన ప్రార్థనలలో మిక్కిలి సుందరమైనది కీర్తనలు 43:3లో లిఖించబడియున్నది. "నీ వెలుగును నీ సత్యమును బయలు దేరజేయుము; అవి నాకు త్రోవచూపును అవి నీ పరిశుద్ధపర్వతమునకును నీ నివాసస్థలములకును నన్ను తోడుకొని వచ్చును."

సత్యము కొరకు వెదకు ప్రతి యథార్థవంతుని హృదయములో ఇట్టి ఆశతో కూడిన విన్నపమే ఉండవలెను. పరిశుద్ధాత్మచేత వెలిగింపబడవలెనని ఆశించువారందరిలో నేర్చుకొనుటకు మరియు విధేయులగుటకు ఇష్టము కలిగియుండు గుణము ఉండవలెను. అట్టివారి యెడల ధన్యవచనములోని వాగ్దానము నెరవేరును. "నీతికొరకు ఆకలిదప్పులు గలవారు ధన్యులు; వారు తృప్తిపరచబడుదురు" (మత్తయి 5:6).

అయితే దేవుడు మన ప్రార్థనకు జవాబిచ్చినప్పుడు, మనము దానికి విధేయులమగు ఉద్దేశము లేనియెడల, సత్యము కొరకు ప్రార్థించుట వ్యర్థము. దేవుడు మనకు అనుగ్రహించు గొప్ప వరములలో ఆయన వాక్యము గూర్చిన జ్ఞానము ఒకటి. దేవుని చిత్తమును గ్రహించుటకు ప్రార్థించి, జవాబు వచ్చినప్పుడు ఏ కారణము చేతనైనను విధేయులగుటకు నిరాకరించుట ఎంతో సాహస కార్యమగును. అనేకులు బైబిలును తమ అల్పమైన, బలహీనమైన అనుభవమునకు సరిపోల్చుకొనుటకు దానిని క్రిందికి లాగుదురు గాని, వాక్యపు ప్రమాణములను అందుకొనుటకు తమ అనుభవమును పైకి తీసుకొనిరారు.

సత్యమును పరీక్షించుటకు ఒకే ఒక గొప్ప నిర్ణయాత్మకమైన గీటురాయి కలదు, అదియే బైబిలు. ప్రతి మతపరమైన ఆలోచన, మనము చదివే ప్రతి పుస్తకము, మరియు మనము వినే ప్రతి ప్రసంగము దైవప్రేరితమైన లేఖనములనెడి తప్పిపోని కొలబద్దతో కొలవబడవలెను. మనము చిన్ననాటినుండి ఏమి నేర్పబడితిమన్నది గాని, మెజారిటీ (అధిక సంఖ్యాకులు) దేనిని

వెంబడించుచున్నారన్నది గాని, లేదా మనోభావములు మనలను ఏమి తలంచునట్లు లేక నమ్మునట్లు చేయుచున్నవన్నది గాని ప్రాముఖ్యము కాదు. సంపూర్ణ సత్యమును పరీక్షించు విషయములో ఈ అంశములు నిలువనేరవు. అంతిమ ప్రశ్న ఏమనగా: ఈ విషయము గూర్చి దేవుని వాక్యము ఏమి చెప్పుచున్నది?

తాము నమ్మువాటి విషయములో యథార్థముగా ఉండినయెడల, దేవుడు తమను అంగీకరించి రక్షించునని కొందరు తలంతురు. అయినను, యథార్థత మాత్రమే సరిపోదు. ఒకడు యథార్థవంతుడై యుండియు, యథార్థముగానే తప్పులో ఉండవచ్చును. కొన్ని సంవత్సరముల క్రితము నేను ఫ్లోరిడాలోని వెస్ట్ పామ్ బీచ్ (West Palm Beach) కు వెళ్లుచుంటిని. నేను అక్కడికే వెళ్లుచున్నానని తలంచితిని. అది రాత్రి సమయము, చాల సేపటివరకు నాకు ఏ రోడ్డు సూచికలు కనబడలేదు. హఠాత్తుగా నా కారు వెలుతురులో “బెల్లె గ్లేడ్ (Belle Glade) 14 మైళ్లు” అని వ్రాయబడిన బోర్డు కనబడెను. నేను వెస్ట్ పామ్ బీచ్ కు వ్యతిరేక దిశలో ప్రయాణించుచున్నానని తెలిసికొని గుండె పగిలినంత పనాయెను. నేను తప్పుడు మార్గములో ఉంటిని. ఆ రాత్రి నాకంటే యథార్థవంతుడు మరియొకడు ఉండడు, కానీ నేను యథార్థముగానే తప్పులో ఉంటిని. ఇక, ఏదో ఒక విధముగా, ఎక్కడో ఒకచోట ముందు వెస్ట్ పామ్ బీచ్ దొరుకునని చెప్పుకొనుచు నేను అదే దారిలో వెళ్లియుండవచ్చును. దానికి బదులుగా, నేను కారును వెనుకకు త్రిప్పి, ఎక్కడ తప్పు మలుపు తీసుకొంటినో అక్కడికి వెళ్లి, వెస్ట్ పామ్ బీచ్ కు వెళ్లు సరైన మార్గమును పట్టుకొంటిని. అదొక్కటే చేయదగిన సరైన పని.

అధ్యాయము 2

# మూయబడిన మనస్సులు మరియు మెజారిటీ పాలన అను నియమము

**దిద్దుబాటుకు** ఒప్పుకొనువారికి దేవుని వాక్యము చాలా సంగతులను బోధించును. అందరికంటే ఎక్కువగా జాలిపడవలసిన వారు ఎవరనగా

మూయబడిన మనస్సులు గలవారే. తమ వ్యక్తిగత అభిప్రాయములకు భిన్నముగా ఉన్న ఏ సమాచారమునైనను వారు ఎదిరింతురు. వారి మనస్సులు నిర్ణయించుకొనినవి గనుక, వాస్తవములను బట్టి ఇబ్బంది పడుటకు వారికి ఇష్టముండదు. విశ్రాంతిదినము (Sabbath) అను సంగతి విషయములో ఇది మరి ముఖ్యముగా వాస్తవమైయున్నది.

అనేకులు వారములోని ఏ దినమును ఆచరించవలెనను విషయములో పారంపర్యముగా వచ్చిన అభిప్రాయములను కలిగియున్నారు గనుక, వేరొక దృక్కోణమును నిష్పక్షపాతముగా చూచుట వారికి కష్టముగా ఉన్నది. పది ఆజ్ఞలలో ఒక ఆజ్ఞ వారములోని ఏడవ దినమును ఆచరించవలెనని కోరుచున్నదని వారిలో అనేకులకు తెలియును. ఏడవ దినము శనివారమని (Saturday) కూడా వారికి తెలియును. అయినను దేవుడు ఆజ్ఞాపించిన దినమును గాక వేరొక దినమును ఆచరించుట అను పారంపర్యాచారమును వారు పట్టుదలగా వెంబడించుదురు. వారు వారముయొక్క మొదటి దినమగు ఆదివారమున (Sunday) ఆరాధించుదురు, అయితే దాని గూర్చి బైబిలులో ఎట్టి ఆజ్ఞయు లేదు.

వారెందుకు అలాగు చేయుదురు? చాలామంది ఆదివారమును ఆచరించువారు, తాము పెరిగిన సమాజములోని మతపరమైన మెజారిటీ ప్రజల ఆచారమును అంగీకరించియున్నారు; అనేకులు ఆలాగు చేయుచున్నారు గనుక అది సరైనదై యుండవలెనని వారు ఊహించుదురు. ఇది సురక్షితమైన ఊహయేనా? మతపరమైన విషయములలో మెజారిటీ ప్రజలు ఎప్పుడైనను సరిగా ఉండిరా?

ఈ ప్రశ్నలకు బైబిలు స్పష్టముగా 'లేదు' అని సమాధానమిచ్చుచున్నది. కనీసం మతపరమైన విషయములలోనైనను, మెజారిటీ ఎల్లప్పుడు తప్పుగానే ఉన్నదని అందుబాటులో ఉన్న ప్రతి సమాచారము బయలుపరచుచున్నది. యేసు తానే ఇట్లనెను, "నోవహు దినములలో జరిగినట్టు మనుష్యకుమారుని దినములలోను జరుగును" (లూకా 17:26). జలప్రళయమునుండి రక్షింపబడుటకు కేవలము ఎనిమిదిమంది మాత్రమే ఓడలోనికి వెళ్లిరి. లోకము ముగింపునందు కేవలము కొద్దిమంది మాత్రమే రక్షింపబడుదురని

క్రీస్తు బోధించెను. ఆయన ఇట్లనెను: “ఇరుకు ద్వారమున ప్రవేశించుడి; నాశనమునకు పోవు ద్వారము వెడల్పును, ఆ దారి విశాలమునైయున్నది, దాని ద్వారా ప్రవేశించువారు అనేకులు. జీవమునకు పోవు ద్వారము ఇరుకును, ఆ దారి సంకుచితమునై యున్నది, దాని కనుగొనువారు కొందరే” (మత్తయి 7:13, 14).

నేడు అనేకులు, ప్రసిద్ధ సువార్తికులు మరియు దైవశాస్త్ర పండితులతో సహా క్రైస్తవులలోని గొప్ప మెజారిటీ ప్రజలు ఏడవ దినమగు విశ్రాంతిదినమునకు బదులుగా ఆదివారమును ఆచరించుచున్నారన్న మాట వాస్తవమే. ఆ వాస్తవము మాత్రమే ఎవరిని ప్రభావితము చేయకూడదు. క్రీస్తు మాటల వెలుగులో దానిని గమనించిన యెడల, అది హెచ్చరిక అను జెండాను ఎత్తవలెను. సత్యము జనసమూహములలో ఎన్నడును ప్రసిద్ధిచెంది ఉండలేదు. పూర్వకాలములలో వలెనే నేడును మెజారిటీలో ఉన్నవారు, తమకు ఇష్టమువచ్చినట్లు జీవించుటకు అనుమతించు మృదువైన, సులభమైన, సౌకర్యవంతమైన మతము కొరకు చూచుచున్నారే గాని, సత్యము కొరకు కాదు.

అట్లయితే, విశ్రాంతిదిన సత్యమునకు పరీక్ష ఏమైయుండవలెను? ఒకే ఒక్కటి, అది దేవుని వాక్యము మాత్రమే. దురదృష్టవశాత్తు, లక్షలాదిమంది ఈ విషయమై బైబిలును స్వయముగా పరిశీలించలేదు. ఆదివారమును ఆచరించు ఈ మెజారిటీ గుంపు యొక్క ఆచారము సరియైనదో కాదో తెలిసికొనుటకు మనము దానిని పరీక్షించవలెనని నేను కోరుచున్నాను. అది బైబిలుపరమైనదే అయితే, మనమందరము దానిని అంగీకరించి ప్రతి ఆదివారమును నమ్మకముగా ఆచరించవలెను. ఒకవేళ లేఖనములు దానిని సమర్థించని యెడల, మన ప్రభువు మనకొరకు ఏ దినమును ఆమోదించెనో ఆ దినమును కనుగొనువరకు మనము వాక్యమును జాగ్రత్తగా పరిశోధించవలెను.

ఈ విషయమును సమీపించుటకు నాకు తెలిసిన అత్యంత నిజాయితీ గల మార్గమేమనగా, వారముయొక్క మొదటి దినము గూర్చి బైబిలు చెప్పుచున్న ప్రతిదానిని నిశితముగా పరిశీలించుటయే. క్రొత్త నిబంధనలో

ఆదివారమును గూర్చి కేవలము ఎనిమిది వచనములు మాత్రమే కలవు, వీటిని జాగ్రత్తగా ధ్యానించుట ద్వారా సాక్ష్యాధారములన్నియు మన యెదుట ఉన్నవని మనము నిర్ధారించుకొనవచ్చును. ఒకవేళ వారముయొక్క మొదటి దినమును ఆచరించుటకు ఏదైనను బైబిలు అధికారము ఉన్నయెడల, అది ఈ వచనములలో ఏదో ఒకదానిలో కనబడవలెను.

ఈ విధమైన సంపూర్ణ అధ్యయనము యొక్క పర్యవసానములను ఎదుర్కొనుటకు మనము సిద్ధముగా ఉన్నామా? ఇచ్చటనే మన పక్షపాతము పరీక్షింపబడును! ఈ నిష్పక్షపాతమైన పరిశోధన బయలుపరచు ఏ విషయమునకైనను మనము మన మనస్సులను పూర్తిగా తెరవగలమా? ఇవి జిత్తులమారి ప్రశ్నలు కావు. ఏ దినము విశ్రాంతిదినముగా కనబడునను విషయము నాకు అనవసరము. బైబిలు బోధించిన యెడల, సోమవారము, గురువారము, శుక్రవారము లేదా ఆదివారమునైనను ఆచరించుటకు నేను సంతోషముగా ఒప్పుకొందును. చాలాకాలము క్రితమే, నేను క్రైస్తవునిగా ఉండి, నా భావములతో నిమిత్తము లేకుండా దేవుని వాక్యము ఎక్కడికి నడిపించినను దానిని వెంబడించవలెనని నిర్ణయించుకొంటిని. బైబిలులో ఆజ్ఞాపించబడిన దినమైతే చాలు, నేను ఏ దినమును పవిత్రముగా ఆచరించుచున్నాననునది నాకు సమస్య కాదు! వారముయొక్క మొదటి దినమును గూర్చి ప్రస్తావించిన క్రొత్త నిబంధనలోని ప్రతి రిఫరెన్సును మనము పరీక్షించుచుండగా మీరుకూడా ఆలాగుననే భావింతురని నేను నిరీక్షించుచున్నాను.

అధ్యాయము 3

# ఆదివారమున పునరుత్థానము

**మొదటి** సువార్తతో ప్రారంభించుదము. మత్తయి ఇట్లు వ్రాయుచున్నాడు, “విశ్రాంతిదినము గడచిపోయిన తరువాత ఆదివారమున, తెల్లవారుచుండగా మగ్దలేనే మరియయు వేరొక మరియయు సమాధిని చూడవచ్చిరి” (మత్తయి 28:1). విశ్రాంతిదినము ఎట్టి పరిస్థితిలోను వారముయొక్క

మొదటి దినము కానేరదని చెప్పుటకు మనకిక్కడ ఆసక్తికరమైన రుజువు ఉన్నది. ఈ రికార్డు ప్రకారము, విశ్రాంతిదినము ముగియుచుండగా మొదటి దినము ప్రారంభమగుచున్నది. అవి రెండును ఒకదాని తరువాత ఒకటి వచ్చు దినములు. లేఖనము ఆధారముగా ఎవరైనను ఆదివారమును విశ్రాంతిదినమని సత్యబద్ధముగా పిలువలేరు. అది గందరగోళముగాను మరియు బైబిలు విరుద్ధముగాను ఉండును.

మత్తయి సాక్ష్యము యొక్క సారాంశమేమనగా, విశ్రాంతిదినము గడచిన తరువాత వచ్చు దినమున తెల్లవారుజామున స్త్రీలు వచ్చిరి మరియు యేసు అప్పటికే లేచియుండుటను చూచిరి. ఇది తర్వాతి సువార్తతో సంపూర్ణముగా ఏకీభవించుచున్నది, అది మరికొన్ని వివరములను జతచేయుచున్నది. మార్కు "తెల్లవారుచుండగా" అనుదానిని "సూర్యోదయమైనప్పుడు" అనుదానితో సమానము చేయుట గమనించండి. అతడిట్లు వ్రాసెను: "విశ్రాంతిదినము గడచిపోగానే మగ్దలేనే మరియయు, యాకోబు తల్లియైన మరియయు, సలోమేయు వచ్చి, ఆయనకు పూయవలెనని సుగంధ ద్రవ్యములు కొనిరి. వారు ఆదివారమున పెందలకడనే (లేచి బయలుదేరి) సూర్యోదయమైనప్పుడు సమాధియొద్దకు వచ్చుచుండగా – సమాధి ద్వారమునుండి మనకొరకు ఆ రాయి యెవడు పొర్లించునని ఒకరితో ఒకరు చెప్పుకొనుచుండిరి" (మార్కు 16:1–3).

"విశ్రాంతిదినము గడచిపోయిన తరువాత ఆదివారమున తెల్లవారుచుండగా" అని మత్తయి పలికిన మాటల అర్థము విషయమై తలెత్తిన ఒక సాధారణ అపార్థమును ఈ సమాంతర సువార్త వృత్తాంతములు తేటపరచుచున్నవి. శనివారము సాయంకాలము సూర్యాస్తమయమునకు ముందే అని దీనిని కొందరు వ్యాఖ్యానించిరి. హెబ్రీయుల లెక్క ప్రకారము సూర్యాస్తమయముతో విశ్రాంతిదినము ముగియును గనుక, సూర్యాస్తమయమున మొదటి దినము రాకమునుపే స్త్రీలు వచ్చిరని వారు ఊహించుదురు.

వచనముతో వచనమును పోల్చి చూచుటలో గల విలువను మనమిక్కడ చూడగలము. స్త్రీలు శనివారము రాత్రి వచ్చి సమాధి ఖాళీగా ఉండుటను చూచిరని తలంచుటను మార్కు మాటలు అసాధ్యము చేయుచున్నవి.

అతడు అవే స్త్రీల పేర్లను ఉదహరించుచు, వారు ఆదివారము ఉదయము సూర్యోదయమైనప్పుడు వచ్చిరనియు, అయితే వారు “ఆ రాయి మనకొరకు ఎవడు పొర్లించును?” అని ప్రశ్నించుకొనుచుండిరనియు వ్రాసెను. ఒకవేళ వారు అంతకుముందు రాత్రి అక్కడికి వెళ్లి సమాధి ఖాళీగా ఉండుటను కనుగొనియుండిన యెడల, రాయి అప్పటికే ద్వారమునుండి తీసివేయబడినదని వారికి తెలిసియుండెడిది గదా. కావున, మత్తయి చెప్పిన “తెల్లవారుచుండగా” అను మాట ఆదివారము ఉదయము సూర్యోదయ సమయమున జరిగిన సందర్శనమును గూర్చియే అని మనము స్పష్టముగా గ్రహించగలము.

మొదటి దినము (ఆదివారమును) గూర్చిన క్రొత్త నిబంధనలోని మూడవ రిఫరెన్సు మార్కు 16:9లోని సాధారణ కథన వాక్యము: “ఆదివారము తెల్లవారినప్పుడు యేసు లేచి, తాను ఏడు దయ్యములు వెళ్లగొట్టిన మగ్దలేనే మరియకు మొదట కనబడెను.” ఇక్కడ ఎక్కువ వివరణ అవసరము లేదు, ఎందుకనగా ఆదివారము ఉదయమున జరిగిన పునరుత్థాన వృత్తాంతమునే ఈ వచనము మరల చెప్పుచున్నది. గమనించవలసిన ప్రాముఖ్యమైన విషయమేమనగా, ఈ వచనములలో ఎక్కడను వారముయొక్క మొదటి దినము పరిశుద్ధమైనదని చెప్పబడలేదు. పునరుత్థానము ఘనత నిమిత్తము ఎవరైనను ఆ దినమును ఆచరించినట్లు ఎట్టి సూచనయు లేదు.

అధ్యాయము 4

# నిజమైన విశ్రాంతిదినమును కనుగొనుట

**పునరుత్థాన** సంఘటనల యొక్క సంపూర్ణ చిత్రములలో ఒకటి లూకా సువార్తలో కనబడును, మరియు ఇక్కడ మనము ఆదివారమును గూర్చిన నాలుగవ రిఫరెన్సును చదువుదుము. “అతడు (అరిమతయి యోసేపు) పిలాతునొద్దకు వెళ్లి, యేసు దేహమును (తనకిమ్మని) అడుగుకొని దానిని క్రిందికి దించి, సన్నపు నారబట్టతో చుట్టి, తొలిచిన రాతి సమాధిలో ఉంచెను. అందులో ఎవడును అంతకు మునుపెప్పుడును ఉంచబడలేదు.

ఆ దినము సిద్ధపరచు దినము; విశ్రాంతి దినారంభము కావచ్చెను" (లూకా 23:52-54).

ముందుకు చదువకమునుపు, ఈ సిలువ వేయబడిన దినము యొక్క దైవప్రేరిత వివరణను మనము జాగ్రత్తగా పరిశీలింతము. మనము ఇప్పుడు "గుడ్ ఫ్రైడే" (Good Friday) అని పిలుచు దినముననే ఈ సంఘటనలు జరిగినవని క్రైస్తవులలో అత్యధికులు అంగీకరించుదురు. ఇక్కడ అది "సిద్ధపరచు దినము" అని పిలువబడినది, ఎందుకనగా అది రాబోవు విశ్రాంతిదినము కొరకు విశేష ఏర్పాట్లు చేసికొను సమయమైయుండెను. వాస్తవానికి, "విశ్రాంతి దినారంభము కావచ్చెను" అని ఆ వచనము చాలా తేటగా చెప్పుచున్నది. దీని అర్థము అది తర్వాతి దినముగా వచ్చుచున్నది.

యేసు మరణించిన ఆ దినమున ఇంకేమి జరిగెను? "గలిలయ నుండి ఆయనతో కూడ వచ్చిన స్త్రీలు వెంట వెళ్లి, ఆ సమాధిని, ఆయన దేహము ఏలాగుంచబడెనో చూచి తిరిగి వెళ్లి, సుగంధద్రవ్యములను పరిమళ తైలములను సిద్ధపరచి, ఆజ్ఞచొప్పున విశ్రాంతిదినమున తీరికగా ఉండిరి" (లూకా 23:55, 56).

ఆ విధికృతమైన శుక్రవారము మిగిలిన భాగములో, భక్తిగల ఆ స్త్రీలు సుగంధద్రవ్య సామాగ్రిని కొని ఆదివారము ఉదయము సమాధిని సందర్శించుటకై మరికొన్ని ఏర్పాట్లు చేసికొనిరి. అప్పుడు, సూర్యాస్తమయముతో విశ్రాంతిదినము ప్రవేశించగా, వారు "ఆజ్ఞచొప్పున విశ్రాంతిదినమున తీరికగా ఉండిరి." ఆ పరిశుద్ధ దినము పది ఆజ్ఞలలోని వారపు విశ్రాంతిదినమే గాని, వారములో ఏ దినమునైనను రాగలిగిన పస్కా లేదా మరి ఇతర పండుగ దినములు కావని ఇది గుర్తించుచున్నది.

విశ్రాంతిదినమునకు తర్వాతి దినమున స్త్రీలు ఏమి చేసిరో తర్వాతి వచనము చెప్పుచున్నది. "అయితే ఆదివారమున తెల్లవారుచుండగా (ఆ స్త్రీలు) తాము సిద్ధపరచిన సుగంధద్రవ్యములను తీసికొని సమాధియొద్దకు వచ్చి, సమాధి ముందర (ద్వారమునకు) ఉండిన రాయి దొరలింప బడియుండుట చూచి లోపలికి వెళ్లిరి" (లూకా 24:1, 2). మొదట, పునరుత్థాన దినమున ఆ స్త్రీలు తమ సాధారణ పనిని చేయుటకు వచ్చిరని మనము గమనించుచున్నాము. ఆధునిక

సంఘములు ఆ నిర్దిష్టమైన వారముయొక్క మొదటి దినమును “ఈస్టర్ సన్ డే” (Easter Sunday) అని పిలుచుదురు. ఆ ఉదయకాలపు చీకటి వేళలో ఎప్పుడో యేసు లేచెననుటలో ఎట్టి సందేహము లేదు. పునరుత్థానము జరిగిన దినమునకు ఆ స్త్రీలు గాని, మరి ఎవరైనను గాని ఎట్టి పవిత్రతను పరిశుద్ధతను ఆపాదించినట్లు సువార్త కథనములలో ఎక్కడను మనకు ఆధారము లేదు.

ఆ చారిత్రాత్మక వారాంతమును గూర్చిన లూకా వృత్తాంతము, నిజమైన ఏడవ దినపు విశ్రాంతిదినమును ఇంకను కచ్చితముగా కనుగొనవచ్చునని ఎట్టి సందేహము లేకుండా రుజువు చేయుచున్నది. అతడు శుక్రవారము, శనివారము మరియు ఆదివారము అను మూడు వరుస దినములలో జరిగిన సంఘటనల క్రమమును వివరించుచున్నాడు. యేసు సిద్ధపరచు దినమున మరణించెను, మరియు విశ్రాంతిదినము సమీపించుచుండెను. క్రైస్తవులు ఇప్పుడు దానిని “గుడ్ ఫ్రైడే” అని పిలుచుదురు. తర్వాతి దినము “ఆజ్ఞచొప్పున” విశ్రాంతిదినమైయుండెను. “ఏడవ దినము నీ దేవుడైన యెహోవాకు విశ్రాంతిదినము” (నిర్గమకాండము 20:10) అని ఆజ్ఞ స్పష్టముగా నిర్దేశించుచున్నది గనుక, ఆ విశ్రాంతిదినము శనివారమై ఉండవలెను.

సృష్టి పనిని ముగించి విశ్రాంతిదినమున ఎట్లు విశ్రమించెనో, ఆలాగుననే విమోచన పనిని ముగించి యేసు సమాధిలో విశ్రాంతిదినమున విశ్రమించుట గమనించదగిన ఆసక్తికరమైన విషయము.

విశ్రాంతిదినము తర్వాతి దినమున యేసు లేచెను. నేడు అది “ఈస్టర్ సన్ డే” అని పిలువబడుచున్నది, కానీ బైబిలు దానిని “ఆదివారము” (వారముయొక్క మొదటి దినము) అని నిర్దేశించుచున్నది. క్రైస్తవ్యమంతయు అంగీకరించుచున్న ఈ తిరుగులేని చారిత్రక వాస్తవముల వెలుగులో, నిజమైన విశ్రాంతిదినము తెలియదని ఎవరూ సాకులు చెప్పలేరు. అది గుడ్ ఫ్రైడే మరియు ఈస్టర్ సన్ డే మధ్యలో ఉండు దినము. లూకా యొక్క రికార్డు ఆ మూడు దినముల కాలక్రమమును ఎంత కచ్చితముగా వివరించుచున్నదనగా, సామాన్యులు మరియు చదువురాని

పామరులు సైతము మన ఆధునిక క్యాలెండరులో బైబిలు చెప్పిన ఏడవ దినమును కనుగొనగలరు.

ఇప్పుడు మనము ఆదివారమును గూర్చిన ఐదవ క్రొత్త నిబంధన వాక్యమును పరీక్షించుటకు సిద్ధముగా ఉన్నాము. "ఆదివారమున ఇంకను చీకటిగా ఉన్నప్పుడు మగ్దలేనే మరియ పెందలకడ సమాధియొద్దకు వచ్చి, సమాధి మీద ఉండిన రాయి తీయబడియుండుట చూచెను" (యోహాను 20:1). యోహాను వివరించిన పునరుత్థాన వృత్తాంతములో క్రొత్త సమాచారము చాలా తక్కువగా ఉన్నది. ఇతర రచయితల వలెనే అతడును, వారముయొక్క మొదటి దినము ఎప్పుడైనను పరిశుద్ధముగా ఎంచబడినట్లు గాని ఎవరైనను ఆచరించినట్లు గాని ఎట్టి సూచనను ఇవ్వలేదు. ఇప్పటివరకు, మనము పరిశీలించిన సువార్త కథనములన్నిటిలో ఒక ముఖ్యమైన సాధారణ అంశమేమనగా, ఆదివారము పరిశుద్ధ దినమనుటకు ఆధారము పూర్తిగా లేకపోవుటయే.

అధ్యాయము 5

# యూదులకు భయపడి

**యోహాను** అదే అధ్యాయములో మరల "మొదటి దినము" (ఆదివారము) ను ప్రస్తావించెను, మరియు ఆదివారపు ఆరాధన కొరకు ఇది ఒక రిఫరెన్సు అని తరచుగా తప్పుగా వ్యాఖ్యానించబడినది. "ఆదివారము సాయంకాలమున శిష్యులు యూదులకు భయపడి, తాము కూడియున్న యింటి తలుపులు మూసికొనియుండగా యేసు వచ్చి మధ్యను నిలిచి—మీకు సమాధానము కలుగునుగాక అని వారితో చెప్పెను" (యోహాను 20:19).

మూయబడిన తలుపుల వెనుక జరిగిన ఈ కూడిక పునరుత్థాన దినముననే జరిగినప్పటికిని, అది ఆ సంఘటన యొక్క విశేష జ్ఞాపకార్థ దినమా? అట్టిది జరుగుట అసాధ్యమని అక్కడి పరిస్థితులు తెలియజేయుచున్నవి. వారు అక్కడ "యూదులకు భయపడి" కూడియుండిరని ఆ వచనము తేటగా చెప్పుచున్నది. భయపడిన శిష్యులకు సమాధి ఖాళీగా ఉన్నదని

అప్పటికే తెలిసెను, మరియు యేసు దేహమును దొంగిలించిరని తమపై త్వరలో నేరము మోపబడునని వారు ఊహించిరి. తమను తాము సంరక్షించుకొనుటకును మరియు ధైర్యము కొరకును వారు ఆ గదిలో తలుపులు వేసికొని గుంపుగా కూడియుండిరి.

వాస్తవమేమనగా, క్రీస్తు మృతులలోనుండి లేచెనని వారు నమ్మలేదు. మగ్దలేనే మరియ మరియు పునరుత్థానుడైన ప్రభువును కళ్లారా చూచి వర్తమానము తెచ్చిన ఇతర శిష్యుల సాక్ష్యమును వారు పూర్తిగా తృణీకరించిరని మార్కు వృత్తాంతము బయలుపరచుచున్నది. “ఆయనతో ఉండినవారు దుఃఖపడి ఏడ్చుచుండగా ఆమె వెళ్లి ఆ సంగతి వారికి తెలియజేసెను గాని, ఆయన బ్రతికియున్నాడనియు ఆమెకు కనబడెననియు వారు విని నమ్మకపోయిరి. ఆ తరువాత వారిలో ఇద్దరు ఒక పల్లెటూరికి నడిచి పోవుచుండగా, ఆయన మారు రూపముగలవాడై వారికి ప్రత్యక్షమాయెను. వారు వెళ్లి తక్కినవారికి ఆ సంగతి తెలియజేసిరి గాని, వారు వీరి మాటనైనను నమ్మకపోయిరి. పిమ్మట పదునొకండుమంది శిష్యులు భోజనమునకు కూర్చున్నప్పుడు ఆయన వారికి ప్రత్యక్షమై, తాను లేచిన తరువాత తన్ను చూచినవారి మాట నమ్మనందున వారి అపనమ్మిక నిమిత్తమును హృదయకాఠిన్యము నిమిత్తమును వారిని గద్దించెను” (మార్కు 16:10-14).

ఈ మాటలను బట్టి, మూయబడిన గదిలో జరిగిన ఆ ఇబ్బందికరమైన ఆదివారపు సాయంకాలపు కూడికను మనము మౌనముగా దాటిపోవలెను. కొందరు చిత్రించినట్లుగా, పునరుత్థానమును గూర్చి హద్దులు లేని సంతోషము గల సందర్భము కాదది. వాస్తవానికి, ఒక అద్భుతము జరిగెనని శిష్యులు గుర్తించనులేదు. వారు భయముతో, కృంగుదలతో, మరియు అవిశ్వాసముతో ఉండిరి. యేసు వారికి కనబడినప్పుడు, వారి విశ్వాసలేమిని బట్టియు, ఆయనను చూచిన తమ సొంత సహచరుల సాక్ష్యమును నిరాకరించినందుకును ఆయన వారిని కఠినముగా గద్దించెను. పునరుత్థానమును ఘనపరచు సంతోషకరమైన ఆరాధనగా దీనిని మార్చుట ఎంత తప్పుదారి పట్టించునదై యున్నది!

ఇప్పటివరకు, ఆదివారము ఆచరణకు ఒక్క ఉదాహరణ కూడా దొరకకుండానే మనము ఎనిమిది క్రొత్త నిబంధన రిఫరెన్సులలో ఆరింటిని జాగ్రత్తగా ధ్యానించితిమి. వాస్తవానికి, ఆరాధన, ప్రార్థన, విశ్రాంతి, లేదా పునరుత్థానమును ఘనపరచుట కొరకు ఆదివారమును గుర్తించినట్లు ఎట్టి జ్ఞానయుక్తమైన సూచన లేదని వాటిలో ప్రతి ఒక్కటి స్థిరముగా బయలుపరచుచున్నది. ఈ సంఘటనలు జరిగిన అనేక సంవత్సరముల తరువాత సువార్తలు వ్రాయబడినవి, కావున సంపూర్ణ వాస్తవములతో రచయితలను ప్రేరేపించుటకు పరిశుద్ధాత్మకు అనేక అవకాశములు ఉండెను. ఆ ఆత్మ యొక్క పని మిమ్మును “సర్వసత్యములోనికి నడిపించుటయే” (యోహాను 16:13) అని యేసు తన శిష్యులతో చెప్పెను. ఆదివారపు ఆచరణ అనునది సత్యములో ఏదో ఒక భాగమైయుండిన యెడల, దానిని మత్తయి, మార్కు, లూకా మరియు యోహానులకు బయలుపరచుటకు పరిశుద్ధాత్మ దైవనియమము చొప్పున బద్ధుడైయుండును గదా. మన ప్రభువు ఆలాగు చెప్పెను.

ఇప్పుడు మనము మిగిలియున్న రెండు రిఫరెన్సుల వైపు తిరుగుదము. ఒకవేళ ఈ వచనములలో మనకు ఎట్టి ఆధారము దొరకనియెడల, మనము వెదకుట ఆపివేయవలెను, ఎందుకనగా చూచుటకు ఇంకెక్కడను లేదు. పౌలు మరియు లూకా ఆదివారమును గూర్చి ప్రస్తావించిన చివరి సాక్షులు, మరియు వారిరువురు చెప్పినదాని విషయమై ఘోరముగా అపార్థము చేసికొనబడిరి.

అధ్యాయము 6

# కొరింథులో ఆదివారము ఆచరింపబడలేదు

**1 కొరింథీయులకు** 16:1–3లో పౌలు ఇట్లు వ్రాసెను: “పరిశుద్ధుల కొరకైన కానుక విషయమైతే నేను గలతీయ సంఘములకు నియమించిన ప్రకారము మీరును చేయుడి. నేను వచ్చినప్పుడు చందా పోగుచేయకుండ

ప్రతి ఆదివారమున మీలో ప్రతివాడును తాను వర్ధిల్లిన కొలది తనయొద్ద కొంత సొమ్ము నిలువ చేయవలెను. ... మీరెవరిని యోగ్యులని యెంచి పత్రికలిత్తురో, వారిచేత మీ ఉపకార ద్రవ్యమును యెరూషలేమునకు పంపుదును.”

అపొస్తలుడు ఏమి చెప్పెనో, మరియు ఏమి చెప్పలేదో దయచేసి జాగ్రత్తగా గమనించండి. ఒక మతపరమైన కూడిక జరిగెననియు చందా పోగుచేయుటకు పళ్లెము పంపబడెననియు అనేకులు ఊహించిరి. అది వాస్తవము కాదు. చిన్న ఆసియాలోని సంఘములకు పౌలు విశేష విన్నపములను వ్రాయుచుండెను, ఎందుకనగా యెరూషలేములోని క్రైస్తవులలో అనేకులు ఆహారము మరియు నిత్యవసరములు లేక మిక్కిలి శ్రమపడుచుండిరి. పౌలు కొరింథులోని సంఘమును ఆహారము, వస్త్రములు మొదలగువాటిని సేకరించి, అతడు మనుష్యులను పంపి యెరూషలేమునకు తరలించువరకు వాటిని ఇంటనే నిలువ చేయవలెనని కోరెను. మూలభాషయగు గ్రీకులో “తనయొద్ద ... నిలువ చేయవలెను” అను పదప్రయోగము, ఇంటనే పక్కన పెట్టుట అను స్పష్టమైన అర్థమునిచ్చుచున్నది. ఆదివారమును సమర్థించువారు సైతము దీనిని అంగీకరించుచున్నారు.

వారముయొక్క మొదటి దినమున ఎట్టి ఆరాధన జరుగలేదు. పోగుచేయుట మరియు నిలువచేయుట అను పని ఆ దినమున జరుగవలసియుండెను. ఈ పనిని ఆదివారమున చేయమని పౌలు ఎందుకు సూచించెను, మరియు అది చేయుటలో ఏమి ఇమిడియున్నది?

మొదటిగా, వారందరూ ఆరాధన కొరకు కూడివచ్చినప్పుడు విశ్రాంతిదినమున ఆ పత్రిక సంఘముతో పంచుకొనబడియుండును. ఆ పని చేయుటకు మరుసటి దినమైన ఆదివారము మొదటి అవకాశమైయుండును. యెరూషలేములో ఆహార కొరత ఉండెననియు, ఆ అవసరత ప్రాముఖ్యముగా డబ్బు కాదనియు గుర్తుంచుకొనండి. అపొస్తలుల కార్యములు 11:28–30లో లూకా మనకు గుర్తుచేసినట్లుగా, మధ్య ప్రాచ్య ప్రాంతములలో అట్టి కరువు పరిస్థితులు అసాధారణమేమి కాదు.

రోములో ఉన్న సంఘము ఆ శ్రమపడుచున్న క్రైస్తవుల విశేష అవసరతలను గూర్చి ఒక సూచన ఇచ్చుచున్నది. “అయితే ఇప్పుడు పరిశుద్ధుల కొరకు పరిచర్య చేయుచు యెరూషలేమునకు వెళ్లుచున్నాను. ఏలయనగా యెరూషలేములో ఉన్న పరిశుద్ధులలో బీదలైన వారి నిమిత్తము మాసిదోనియవారును అకయవారును కొంత సొమ్ము చందా వేయ నిష్టపడిరి. అవును వారిష్టపడి దానిని చేసిరి; వారు వీరికి ఋణస్థులు; ఎట్లనగా అన్యజనులు వీరి ఆత్మసంబంధమైనవిషయములలో పాలివారై యున్నారు గనుక, శరీరసంబంధమైనవిషయములలో వీరికి సహాయము చేయబద్ధులై యున్నారు. ఈ పనిని ముగించి, ఈ ఫలమును వారికప్పగించి, నేను, మీ పట్టణము మీదుగా స్పెయినునకు ప్రయాణము చేతును” (రోమీయులకు 15:25–28).

ఇక్కడ అపొస్తలుడు తన ప్రభావవంతమైన విన్నపములో ఒక సున్నితమైన అంశమును తాకుచున్నాడు. తమకు సువార్త ప్రకటించుటకు బోధకులను పంపిన మాతృ సంఘమైన యెరూషలేమునకు రోమా క్రైస్తవులు కృతజ్ఞతా ఋణము కలిగియుండిరి. వారి యొద్దనుండి పొందిన ఆత్మసంబంధమైన సత్యములకు ప్రతిగా శరీరసంబంధమైన, లేదా భౌతికపరమైన కానుకలను ఇవ్వవలెనని పౌలు వారిని కోరుచున్నాడు. ఎట్టి కానుకలను పౌలు మనస్సులో కలిగియుండెను? “ఈ ఫలమును” వారికి అప్పగించుట అని అతడు దానిని వివరించుట చాలా ఆసక్తికరముగా ఉన్నది. ఇక్కడ వాడబడిన “కార్పోస్” (karpos) అను గ్రీకు పదము అక్షరార్థమైన పండ్లకు వాడబడు సార్వత్రిక పదము. అది “ఒకని కష్టార్జితము” అను అర్థమును కూడా కలిగియుండవచ్చును.

“నేను వచ్చినప్పుడు చందా పోగుచేయకుండ” ఉండునట్లు కొరింథు క్రైస్తవులు తమ పనిని ఆదివారమున చేయవలెనని పౌలు ఇచ్చిన సలహాపై ఇది వెలుగు నింపుచున్నది. తోటనుండియు పొలమునుండియు పంటను సమకూర్చుట మరియు నిలువచేయుట వంటి పనులు విశ్రాంతిదినమున చేయుట తగదు గదా. ఈ వచనములలో, ఆదివారము లౌకిక

కార్యకలాపములకు తగిన దినముగా మరల గుర్తించబడినదే గాని మతపరమైన ఆచరణకు ఎట్టి సూచనయు లేదు.

అధ్యాయము 7

# పౌలు యొక్క దీర్ఘకాల ప్రసంగము

**ఆదివారము** పరిశుద్ధతకు సంబంధించి ఏదైనను మద్దతు నిచ్చునేమో అని మనము పరిశీలించబోవు చివరి రిఫరెన్సు యొద్దకు ఇది మనలను తీసుకొనివచ్చుచున్నది. లూకా వ్రాసిన ఆదిమ సంఘ చరిత్రలో, త్రోయలో ఉన్న విశ్వాసులతో పౌలు జరిపిన నాటకీయమైన వీడ్కోలు కూడికను అతడు వివరించుచున్నాడు. దేవుని ఆజ్ఞలకు అవిధేయులగుటను సమర్థించుకొనుటకు చిన్న సాకు కొరకు ప్రాకులాడువారు అపొస్తలుల కార్యములలోని ఈ వృత్తాంతమును ఘోరముగా వక్రీకరించిరి. ఆదివారమున ఒక మతపరమైన కూడిక జరిగినట్లు క్రొత్త నిబంధనలో ఉన్న ఏకైక రికార్డు ఇదే గనుక, మనము దీనిని విశేష శ్రద్ధతోను ఆసక్తితోను పరీక్షించవలెను.

అది రాత్రిపూట జరిగిన కూడిక అని పూర్తి సందర్భము బయలుపరచుచున్నది. “పులియని రొట్టెల దినములైన తరువాత మేము ఓడ ఎక్కి ఫిలిప్పీ విడిచి, అయిదు దినములలో త్రోయకు వచ్చి, అచ్చట వారియొద్ద ఏడు దినములు గడిపితిమి. ఆదివారమున మేము రొట్టె విరుచుటకు కూడినప్పుడు, పౌలు మరునాడు వెళ్లనైయుండి, వారితో ప్రసంగించుచు అర్ధరాత్రివరకు విస్తరించి మాటలాడుచుండెను. మేము కూడియున్న మేడగదిలో అనేక దీపములుండెను. అప్పుడు ఐతుకు అను నొక యౌవనస్థుడు కిటికీలో కూర్చుండి గాఢ నిద్రపోయి, పౌలు చాలసేపు ప్రసంగించుచుండగా నిద్రాభారమువలన జోగి, మూడవ అంతస్తునుండి క్రింద పడి చనిపోయినవాడై ఎత్తబడెను. అంతట పౌలు క్రిందికి వెళ్లి అతనిమీద పడి కౌగిలించుకొని—మీరు తొందరపడకుడి, అతని ప్రాణమతనిలో నున్నదని వారితో చెప్పెను. అతడు మరల పైకి వచ్చి రొట్టె విరిచి పుచ్చుకొని, తెల్లవారువరకు విస్తారముగా సంభాషించి బయలుదేరెను. వారు బ్రదికిన ఆ చిన్నవానిని తీసికొని

వచ్చినప్పుడు వారికి విశేషమైన ఆదరణ కలిగెను. మేము ముందుగా ఓడ ఎక్కి, అస్సులో పౌలును ఎక్కించుకొనవలెనని అక్కడికి వెళ్లితిమి. తాను కాలి నడకను వెళ్లవలెనని అతడా ప్రకారముగా మాకు నియమించియుండెను" (అపొస్తలుల కార్యములు 20:6–13).

త్రోయలో జరిగిన ఈ సంపూర్ణ రాత్రి కూడికలో కొన్ని చాలా అసాధారణ విషయములు కలవు. మొదటిగా, ప్రసంగీకునికి మరియు సంఘమునకు కూడా అది గంభీరమైన, హృదయవిదారకమైన సందర్భము. అపొస్తలుల కార్యములు 20:25లో పౌలు ఇట్లనెను, "ఇదిగో దేవుని రాజ్యమును గూర్చి ప్రకటించుచు నేను మీ మధ్యను సంచరించుచుంటిని; మీలో ఎవరును ఇకమీదట నా ముఖము చూడరని నాకిప్పుడు తెలియును."

ఈ వీడ్కోలు కూడిక ఆదివారమున చీకటి వేళలో జరిగినదని స్పష్టముగా ఉన్నది. గదిలో దీపములు ఉండెను, మరియు పౌలు అర్ధరాత్రి వరకు ప్రసంగించెను. యూదులు దినమును లెక్కించు విధానమును అర్థం చేసికొనుట ప్రాముఖ్యము. అన్యజనులైన రోమీయుల పద్ధతి ప్రకారము దినములు అర్ధరాత్రి నుండి అర్ధరాత్రి వరకు లెక్కించబడలేదు. బైబిలులో, దినము సాయంకాలమున ప్రారంభమగును.

ఆదికాండము సృష్టి వారములోని దినములన్నిటిని అదే రీతిగా వివరించుచున్నది, "అస్తమయమును ఉదయమును కలుగగా ఒక దినమాయెను ... అస్తమయమును ఉదయమును కలుగగా రెండవ దినమాయెను," (ఆదికాండము 1:5, 8) మొదలగునవి. అనగా, దినములో ఎల్లప్పుడు సాయంకాలమే మొదట వచ్చును.

విశ్రాంతిదినము ఈ మాటలలో ఎందుకు వివరింపబడినదో ఇది విశదీకరించుచున్నది, "అది మీకు మహా విశ్రాంతిదినము ... సాయంకాలము మొదలుకొని మరుసటి సాయంకాలమువరకు మీరు విశ్రాంతిదినముగా ఆచరింపవలెను" (లేవీయకాండము 23:32). అయితే బైబిలు ప్రకారము సాయంకాలము ఎప్పుడు ప్రారంభమగును? "సాయంకాలము ప్రొద్దు గ్రుంకినప్పుడు, జనులు సకల రోగులను దయ్యములు పట్టినవారిని ఆయనయొద్దకు తీసికొని వచ్చిరి"

(మార్కు 1:32). విశ్రాంతిదినమున స్వస్థపరచుట తప్పని పరిసయ్యులు బోధించిరి గనుక, విశ్రాంతిదినము గడచువరకు ప్రజలు ఆగి తమ రోగులను యేసునొద్దకు తెచ్చిరి. కావున, వారు "సాయంకాలము ప్రొద్దు గ్రుంకినప్పుడు" వారిని తెచ్చిరి. మోషే ఇట్లు వ్రాసెను, "... సూర్యుడు అస్తమించు సాయంకాలమున పస్కా పశువును వధింపవలెను" (ద్వితీయోపదేశకాండము 16:6).

నెహెమ్యాలో, విశ్రాంతిదిన ఆరంభము గూర్చి మరొక వివరణ మనకు ఇవ్వబడినది. "మరియు విశ్రాంతిదినమునకు ముందు చీకటి పడినప్పుడు యెరూషలేము గుమ్మములను మూసివేయవలెననియు, విశ్రాంతిదినము గడచువరకు వాటిని తీయకూడదనియు నేనాజ్ఞాపించితిని" (నెహెమ్యా 13:19). చీకటి పడుచుండగా సూర్యాస్తమయమందే విశ్రాంతిదినము యొక్క మొదటి క్షణములు ఉండునని ఇది కచ్చితముగా నిర్ధారించుచున్నది.

ఇప్పుడు త్రోయలో జరిగిన పౌలు యొక్క ఆదివారపు కూడికకు ఈ సరైన బైబిలు సూత్రమును అన్వయించుటకు మనము సిద్ధముగా ఉన్నాము. రాత్రి సమయము కాబట్టి అది శనివారము రాత్రి జరిగియుండవలెను. సూర్యాస్తమయమునకు విశ్రాంతిదినము ముగిసి, వారముయొక్క మొదటి దినము (ఆదివారము) ప్రారంభమాయెను. విశ్రాంతిదినమున ప్రజలతో ఉండునట్లు ఏడు దినములు నిలిచిన పౌలు, శనివారము రాత్రి ఓడలో వెళ్లకూడదని నిర్ణయించుకొనెను. దానికి బదులుగా, అతడు రాత్రంతయు విశ్వాసులతో సహవాసము చేసి, ఆదివారము ఉదయమున అస్సులో ఓడ ఎక్కుటకు ఇరవై మైళ్లు ద్వీపకల్పము గుండా నడిచి వెళ్లెను.

యాదృచ్ఛికముగా, పౌలు యొక్క మిషనరీ సహచరులు ఈ ఓడను నడిపించుచుండిరి, జాగ్రత్తగా నిర్ణయించిన ఈ ప్రయాణములోని ముఖ్యాంశములను వ్రాసిన లూకా కూడా వారిలో ఉండెను. శనివారము రాత్రి విశ్రాంతిదినము ముగియువరకు వారు సముద్రములోనికి వెళ్లకపోవుట చాలా ప్రాముఖ్యమైన విషయము. తెడ్లు మరియు తెరచాపలతో కష్టపడుట పరిశుద్ధ దినమున ఎట్లు తగదో, ఆదివారము ఉదయము పౌలు దీవుల

నడుమ ఇరవై మైళ్లు నడుచుట కూడా అంతే తగదు. పౌలు గాని అతని తోడి ప్రయాణికులు గాని దేవుని విశ్రాంతిదినమున ఆ లౌకిక క్రియలలో పాల్గొనియుండేవారు కాదు.

అధ్యాయము 8

# ఐతుకు ఎందుకు సంఘ మేడగది నుండి క్రిందపడెను?

**న్యూ** ఇంగ్లీషు బైబిలు (The New English Bible) ఆ కూడిక శనివారము రాత్రి జరిగినదని స్పష్టముగా చెప్పుచున్నది. కిటికీలోనుండి పడిపోయిన ఐతుకు మృతులలోనుండి లేపబడుటయే ఆ కథనములోని ముఖ్యాంశముగా కనబడుచున్నది. ధైర్యశాలియైన పౌలు, విశ్రాంతిదినమున పరిచర్య చేసి, శనివారము రాత్రంతయు గడిపి, ఆదివారము ఉదయమున అస్సులో తన సహచరులను కలియుటకు ఇరవై మైళ్లు నడిచెను. విశ్రాంతిదినము గడచిన తరువాత శనివారము రాత్రి ఓడ ద్వీపకల్పము చుట్టూ ప్రయాణించుచుండగా వారు ఓడలోనే ఉండిరి. మరునాడు పౌలు కాలినడకన చేసిన ఆ సుదీర్ఘ ప్రయాణము ఎట్టి పవిత్ర దినమునైనను చేయుట చాలా అనుచితముగా ఉండెడిది.

రొట్టె విరుచుటను ప్రభువు రాత్రి భోజనముతో కొందరు సమానము చేసిరి, గాని అట్టి అభిప్రాయమునకు బైబిలు లేఖనములనుండి మద్దతు లేదు. ఆ ఆదిమ క్రైస్తవులు ప్రతిదినము రొట్టె విరిచిరని లూకా మనకు హామీ ఇచ్చుచున్నాడు. "మరియు వారు ఏకమనస్కులై ప్రతిదినము దేవాలయములో తప్పక కూడుకొనుచు ఇంటింట రొట్టె విరుచుచు ... ఆహారము పుచ్చుకొనుచుండిరి" (అపొస్తలుల కార్యములు 2:46, 47).

పౌలు మేడగదిలో విశ్వాసులతో ప్రభువు రాత్రి భోజనము ఆచరించెనను వాదనను బైబిలు ధృవీకరించలేదు. "అతడు మరల పైకి వచ్చి రొట్టె విరిచి పుచ్చుకొని ..." (అపొస్తలుల కార్యములు 20:11) అను వాక్యము, వారు కలిసి భుజించిన సాధారణ భోజనమును సూచించుచున్నట్లు కనబడుచున్నది.

ఇక్కడ భోజనము చేయుట రొట్టె విరుచుటతో జతచేయబడినది. ప్రభువు రాత్రి భోజనము ఈ రీతిగా ప్రస్తావించబడుట అసంభవము.

అయితే ఆ వీడ్కోలు కూడికలో క్రీస్తు శ్రమలను మరియు మరణమును ఆచరించుట ఉన్నప్పటికిని, ఆదివారము ఆచరణకు అది ఎట్టి నమ్మకమును ఇవ్వదు. రొట్టె ప్రతిదినము విరువబడెనని మనము అపొస్తలుల కార్యములు 2 నుండి చూచితిమి, మరియు ప్రభువు రాత్రి భోజనము ఫలానా దినముననే జరుగవలెనని ఎక్కడను లింకు చేయబడలేదు. త్రోయలో జరిగిన కూడిక వారము వారము జరుగు సాధారణ ఆరాధన కాదని ఎవరికైనను స్పష్టమే గదా. యౌవనస్థుడైన ఐతుకు అద్భుతముగా లేపబడుటలోను, మరియు పౌలు తన మరణమునకు ముందు వారిని మరల చూడడను వాస్తవములోను ఆ రాత్రంతా జరిగిన సమావేశము యొక్క ప్రాముఖ్యత కనబడుచున్నది. ఆ నిర్దిష్ట సమయమునకు అనగా శనివారము రాత్రంతటికి ఎట్టి ఆత్మీయ ప్రాముఖ్యత లేదు. శ్రద్ధగల చరిత్రకారుడైన లూకా, పౌలు చేసిన దీర్ఘకాల ప్రసంగములోని సారాంశమును కొంచెము కూడా వ్రాయలేదు గాని, లేపబడిన యౌవనస్థుని అద్భుతమును నమ్మకముగా లిఖించెను. స్పష్టముగా, ఐతుకు సంఘ మేడగది నుండి క్రింద పడిపోయిన విధానమునే గాని, అది జరిగిన దినమును స్థాపించుటకు లూకా ప్రయత్నించుట లేదు.

అదివారమును గూర్చిన ఎనిమిది క్రొత్త నిబంధన రిఫరెన్సులలో ప్రతిదానిని మనము ఇప్పుడు తీవ్రముగా పరీక్షించి ముగించితిమి. ఆదివారము ఎప్పుడైనను దేవునిచేత పరిశుద్ధపరచబడినదని గాని మనుష్యునిచేత ఆచరించబడినదని గాని వాటిలో ఒక్కటి కూడా చిన్న సాక్ష్యమునైనను ఇవ్వలేదు. దేవుని గొప్పదైన తప్పిపోని పరీక్షా గ్రంథము, మెజారిటీ ప్రజలు (అధిక సంఖ్యాకులు) సత్యమునకు బదులుగా పారంపర్యమును వెంబడించుచున్నారని బయలుపరచినది. ఒక వట్టి అన్య మతాచారమును గ్రుడ్డిగా హత్తుకొనునట్లు లక్షలాదిమంది మోసగించబడిరి.

రష్యా జార్ (Czar) చక్రవర్తి ఒక ఉదయము తన విశాలమైన రాజభవన మైదానపు సరిహద్దు ప్రాంతములో నడిచిన కథ నాకు గుర్తుకు వచ్చుచున్నది. అక్కడ ప్రాకారపు గోడ దగ్గర నిర్మానుష్యమైన ఒక మూలలో తుపాకీ భుజమున ధరించి అటు ఇటు కవాతు చేయుచున్న ఒక సైనికుని అతడు చూచెను. అతడు కావలి కాయుచున్నట్లు కనబడెను గనుక, అతడు దేనికి కాపలా కాయుచున్నాడని చక్రవర్తి ఆ సైనికుని అడిగెను. తాను కేవలము ఆజ్ఞలను పాటించుచున్నాననియు, ఆ నిర్దిష్ట స్థలములో తనను ఎందుకు ఉంచిరో తనకు తెలియదనియు ఆ మనుష్యుడు జవాబిచ్చెను. సైనికుడు ఏమి చేయుచున్నాడని చక్రవర్తి ఆ కావలివారి అధిపతిని అడిగెను గాని, అతనికి కూడా తెలియదు. రాజభవన రక్షణ బాధ్యత వహించిన సేనాధిపతిని సంప్రదించిరి గాని, ఆ నియామకమునకు అతడు ఎట్టి కారణము చెప్పలేకపోయెను. చివరకు, రాజు దుమ్ముపట్టిన సైనిక రికార్డులను వెదకమని ఆజ్ఞాపించగా, ఆ మర్మము వీడెను. అనేక సంవత్సరముల క్రితము, రాజమాత ఆ ప్రాకారపు మూలలో కొన్ని గులాబీ పొదలను నాటెను, మరియు ఆ లేత మొక్కలు త్రొక్కబడకుండా కాపాడుటకు ఒక సైనికుడు పంపబడెను. తరువాత, ఆ ఆజ్ఞను రద్దు చేయుట ఎవరికో మరపు వచ్చెను, మరియు ఆ అనుదిన కావలి ఆచారము సంవత్సరాల తరబడి కొనసాగెను, వట్టి ఖాళీ గులాబీ స్థలము తప్ప మరేమియు లేనిదానిని సైనికులు తమ తుపాకులతో కాపలా కాయుచుండిరి.

నేడు ఆదివారము యొక్క పరిశుద్ధతను కాపాడుటకు మతపరముగా ప్రయత్నించుచున్న లక్షలాదిమంది యథార్థవంతులైన క్రైస్తవులు కలరు. కాపాడుటకు అక్కడ నిజముగా ఏమీ లేదని వారు గ్రహించుటలేదు. ఆ నిర్మానుష్యమైన గులాబీ మైదానము వలెనే ఆదివారము పరిశుద్ధత శూన్యమైయున్నది. యేసు ఇట్లనెను, “పరలోకమందున్న నా తండ్రి నాటని ప్రతి మొక్కయు పెల్లగింపబడును” (మత్తయి 15:13) .

అధ్యాయము 9

# వారు ఆచరించిన దినము

**ఆదివారము** ఆచరణ కొరకు సాధ్యమైన అన్ని మూలములను వెదకినను అనుకూలమైన చిన్న సాక్ష్యము కూడా దొరకలేదు గనుక, మనము ఆ ఆదిమ సంఘము యొక్క దైవప్రేరిత చరిత్ర వైపు తిరుగుదము. వారు ఆదివారమును ఆచరించని యెడల, ఏ దినమును ఆచరించిరి? అపొస్తలుల కార్యములు అను గ్రంథము ఏడవ దినపు విశ్రాంతిదిన ఆచరణ యొక్క స్థిరమైన మాదిరిని స్థాపించుచున్నది. ఒక సందర్భములో, తమకొరకు విశ్రాంతిదినమున ప్రత్యేకముగా వాక్యము చెప్పవలెనని అన్యజనులు పౌలును వేడుకొనిరి. "ఈ మాటలను మరుసటి విశ్రాంతిదినమున తమతో చెప్పవలెనని జనులు వేడుకొనిరి ... మరుసటి విశ్రాంతిదినమున దాదాపుగా ఆ పట్టణమంతయు దేవుని వాక్యము వినుటకు కూడివచ్చెను" (అపొస్తలుల కార్యములు 13:42, 44) .

పౌలు మరియు అతని తోడి క్రైస్తవుల విశ్రాంతిదిన ఆచరణను ధృవీకరించు చాలా ఆసక్తికరమైన అంశములు ఈ శక్తివంతమైన వచనములలో కలవు. అన్యజనులు ప్రవేశించుటకు అనుమతి లేని సమాజమందిరములో బోధించిన తరువాత, "మరుసటి విశ్రాంతిదినమున" తమకు బోధించవలెనని అన్యజనులు పౌలును వేడుకొనిరి. పౌలు విశ్రాంతిదినమున సమాజమందిరములలో అప్పటికే యూదుల గుంపు సిద్ధముగా ఉండుటవలననే బోధించెనని అనేకులు ఆరోపించిరి. ఇది తప్పుడు వాదన. ఈ సందర్భములో, మరుసటి విశ్రాంతిదినమున అన్యజనులకు పరిచర్య చేయుటకు పౌలు నియమించుకొనెను, మరియు అపొస్తలుల కార్యములు 13:43 ప్రకారము, ఆ దినమున అతని మాట వినినవారిలో అనేకులు "భక్తిపరులైన యూదుమత ప్రవిష్టులు." దీని అర్థము వారు క్రైస్తవత్వములోనికి మారినవారు, మరియు పౌలును బర్నబాయు "దేవుని కృపయందు నిలుకడగా ఉండవలెనని వారిని హెచ్చరించిరి."

వారి విశ్రాంతిదిన ఆరాధన దేవుని కృపయందు నిలుకడగా ఉండుట అను సందర్భములో చెప్పబడుట ఎంత ఆసక్తికరము! విశ్రాంతిదినమును ఆచరించువారు సువార్త కృపకు చెందనివారని క్రియల మూలముగానే రక్షణ

కలుగునని నమ్మువారని (legalists) ముద్ర వేయుటకు విశ్రాంతిదినమును విమర్శించు ఆధునిక విమర్శకులు ప్రయత్నించుదురు. బైబిలు రచయితలు ఆలాగు చేయలేదు, వారు నిజమైన విశ్వాసముద్వారా కలుగు రక్షణతో విధేయతను నిరంతరము జతచేయుదురు.

సమాజమందిరము గాని యూదులు గాని లేనప్పుడు కూడా పౌలు విశ్రాంతిదినమును ఆచరించెనని అపొస్తలుల కార్యములు 16:13లో మనకు బలమైన రుజువు ఉన్నది. అతడు గ్రీసులో పరిచర్య చేయుచుండగా, అక్కడ చెదరిపోయిన కొద్దిమంది యూదులు మాత్రమే ఉండిరి మరియు సమాజమందిరము ఏదియు లేదు. విశ్రాంతిదినమున అతడేమి చేసెను? "విశ్రాంతిదినమున గవిని దాటి నదితీరమున ప్రార్థన జరుగుననుకొని అక్కడికి వచ్చి కూర్చుండి, కూడివచ్చిన స్త్రీలతో మాటలాడుచుంటిమి."

వెళ్లుటకు సంఘము లేనప్పటికిని, అపొస్తలుడు మతపరమైన ఆరాధన జరుగు స్థలమును, నదితీరమున ప్రార్థన జరుగు స్థలమును వెదకి, అక్కడికి వచ్చినవారికి బోధించెను. నిశ్చయముగా, ఈ అసాధారణమైన బహిరంగ మిషనరీ యాత్రలో పౌలును వెంబడించుచుండగా, విశ్రాంతిదినము పట్ల అతనికి గల లోతైన నిబద్ధతను గుర్తించుటలో ఎవరూ విఫలము కాలేరు. ఈ మాసిదోనియ అనుభవము విశ్రాంతిదినమునకు బదులుగా ఆదివారమున జరిగియున్నదని ఊహించుకొనండి. ఎట్టి ప్రశ్న లేకుండా, ఆదివారపు ఆరాధన కొరకు అది కచ్చితమైన సాక్ష్యముగా ఉదహరించబడియుండెడిది, మరియు మనము ఏకీభవించవలసి వచ్చెడిది. అయితే నిజమైన విశ్రాంతిదిన ఆచరణలో పౌలు చూపిన ఈ మాదిరికి వ్యతిరేకముగా ఒకరు ఎట్టి సాధ్యమైన వాదనలను తేగలరు?

మరల, ఈ మాటలలో పౌలు యొక్క వాడుకను గూర్చి మనము చదువుదుము: "పౌలు తన వాడుకచొప్పున సమాజపు వారియొద్దకు వెళ్లి ... లేఖనములలో నుండి ... వారితో మూడు విశ్రాంతిదినములు తర్కించుచుండెను" (అపొస్తలుల కార్యములు 17:2, 3). "అతడు ప్రతి విశ్రాంతిదినమున సమాజమందిరములో తర్కించుచు, యూదులను గ్రీసు దేశస్థులను ఒప్పించుచు నుండెను" (అపొస్తలుల కార్యములు 18:4).

చివరగా, గొప్ప అపొస్తలుడైన పౌలు తన జీవితమంతటిలో ఒక్క ఆదివారమును కూడా ఎన్నడూ పరిశుద్ధముగా ఆచరించలేదని అతని వ్యక్తిగత సాక్ష్యమును మనము ఉదహరించుదము. తన మరణమునకు ముందు, పౌలు యూద పెద్దలతో ఈ మాటలను నొక్కి వక్కాణించెను: "సహోదరులారా, నేను మన ప్రజలకైనను పితరుల ఆచారములకైనను ప్రతికూలమైనది ఏదియు చేయకపోయినను, యెరూషలేములో నుండి రోమీయుల చేతికి ఖైదీగా అప్పగించబడితిని" (అపొస్తలుల కార్యములు 28:17).

ఒక్క క్షణము ఆలోచించండి! ఒకవేళ పౌలు ఎప్పుడైనను ఉద్దేశపూర్వకముగా విశ్రాంతిదినమును మీరియుండిన యెడల, లేదా ఏడవ దినమును గాక వేరొక దినమును ఆచరించియుండిన యెడల, యూదుల ఆచారమునకు వ్యతిరేకముగా తాను ఏదియు చేయలేదని అతడు సత్యబద్ధముగా ప్రకటించలేకపోయేవాడు గదా. శంకించని యథార్థత గల మనిషి చేసిన ఈ అర్హత కలిగిన ప్రకటన బలముతో, బైబిలులో ఆదివారము ఆచరణ అధికారము కొరకైన అన్వేషణను మనము ముగించుచున్నాము. అది ఎక్కడను లేనే లేదు.

ఒకవేళ మనము దానిని కనుగొనగలిగి ఉంటే, మన మతపరమైన బాధ్యతను నెరవేర్చుట, నిస్సందేహముగా, చాలా సులభమై ఉండెడిది. ప్రొటెస్టెంటు మరియు క్యాథలికు అని తేడా లేకుండా దేశములోని చాలా గొప్ప మత సంస్థల మద్దతు మరియు మాదిరి మనకు ఉండెడిది.

కానీ మనము అత్యంత ప్రసిద్ధమైన మార్గము కొరకు గాని అత్యంత సౌకర్యవంతమైన మార్గము కొరకు గాని చూచుటలేదు; మనము బైబిలు మార్గము కొరకు చూచుచున్నాము. మరియు మనము దానిని కనుగొంటిమి. పూర్తి నిజాయితీతో, దేవుని గొప్ప చేతిరాత గల ధర్మశాస్త్రములో ఆజ్ఞాపించబడిన దినమును గాక వేరొక దినమును ఆచరించు ప్రబలమైన ఆచారము, చివరగా మనకు తీర్పు తీర్చు వాక్యమునకు వ్యతిరేకమని మనము ప్రకటించవలెను. ప్రసిద్ధమైన, మెజారిటీ (అధిక సంఖ్యాకుల) అభిప్రాయము ఎంత ఉన్నను స్పష్టమైన "యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు" అను గంభీరమైన

సాక్ష్యమును రద్దు చేయలేదు. ఈ విషయముపై మన సిద్ధాంతము కొరకు మనము బైబిలు మీద మరియు బైబిలు మీద మాత్రమే నిలువబడవలెను.

దేవుని వాక్యము ఇట్లు ప్రకటించుచున్నది, “ఏడవ దినము నీ దేవుడైన యెహోవాకు విశ్రాంతిదినము; దానిలో (నీవు) ... ఏ పనియు చేయకూడదు” (నిర్గమకాండము 20:10). శక్తి మరియు ఘనత యొక్క ఆర్భాటముతో లోకమునకు పరిచయం చేసిన ఆ నీతి ధర్మశాస్త్రమును దేవుడు ఉపసంహరించుకొనెనని బైబిలులో ఏదైనను సూచన కనబడువరకు, పది ఆజ్ఞలు నేటికిని సందర్భోచితమైనవిగాను మరియ ఆచరింపబద్ధమైనవిగాను మనము అంగీకరించెదము. దేవుడు తన మనస్సులోని మాటే చెప్పెను, మరియు ఆయన చెప్పినదే ఆయన మనస్సులో నుండి వచ్చినది.

జీవనోపాధిని సంపాదించుకొనవలసిన ఈ పోటీతో కూడిన, పారిశ్రామిక సమాజములో ఏడవ దినమును ఆచరించుట అసాధ్యము గనుక దేవుడు మనలను నాలుగవ ఆజ్ఞనుండి మినహాయించునని కొందరు వాదించుదురు. విశ్రాంతిదినమును ఆచరించువానికి స్పష్టమైన నష్టము కలుగునట్లు సాతాను ఆర్థిక ప్రపంచమును మార్చివేసెనన్న మాట నిస్సందేహముగా వాస్తవమే, కానీ దేవుడు అసాధ్యమైన దానిని ఎన్నడును కోరలేదు. ఏ కారణము చేతనైనను దేవుని ఆజ్ఞలలో ఒకదానిని మీరుట ఎన్నడును అవసరము కాదు.

“కానీ నా యజమాని నేను శనివారము పని చేయవలెనని కోరుచున్నాడు, మరియు నా కుటుంబమును పస్తులుండనివ్వలేను గదా” అని నీవు అనవచ్చును. ఆ సందిగ్ధతకు మన ప్రభువు చాలాకాలము క్రితమే కొండమీద ప్రసంగములో జవాబిచ్చెను. ఆయన ఇట్లనెను: “కాబట్టి మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి; అప్పుడవన్నియు మీకనుగ్రహింపబడును” (మత్తయి 6:33). “అవన్నియు” అను మాటను ఆహారము, వస్త్రములు మరియు ఉద్యోగము అని పై వచనము నిర్వచించుచున్నది. ఆయనకు లోబడుటకును మరియు మన యజమానికి లోబడుటకును మధ్య ఎప్పుడైనను ఘర్షణ వచ్చినయెడల, మనము ఆయనకే ప్రథమ స్థానమివ్వవలెనని యేసు సామాన్యముగా చెప్పుచున్నాడు. దేవుని చిత్తమును చేయుటకంటే భౌతికపరమైన అంశములకు ఎన్నడును ఎక్కువ ప్రాముఖ్యత నివ్వకూడదు.

తన ఉద్యోగమునకు ఏమి జరిగినను సరే విశ్రాంతిదినమును ఆచరించుటకు నిర్ణయించుకొను క్రైస్తవుని విశ్వాసమును దేవుడు ప్రతి సందర్భములోను ఘనపరచును. విశ్రాంతిదినమును ఆచరించువాని కొరకు విశేష ఏర్పాట్లు చేయుట ద్వారా దేవుడు అనేకసార్లు అద్భుతములు చేయును. కొన్ని సందర్భములలో, తన పిల్లలు ఉద్యోగములు కోల్పోవుట ద్వారా పరీక్షింపబడుటకు ఆయన అనుమతించును, మరియు వారి విశ్వాసమునకు ప్రతిఫలముగా అంతకంటే మంచివాటిని తెరుచును. ఏది ఏమైనను, పరిస్థితులతో నిమిత్తము లేకుండా మనము ఆయనను నమ్మి విధేయులైనప్పుడు, సమస్తమును సమకూడి జరుగును, "అన్నియు" ఎల్లప్పుడు అనుగ్రహింపబడును.

యెహోవా విశ్రాంతిదినమును ఆచరించుటలోని నిజమైన రహస్యమేమనగా విశ్రాంతిదినపు ప్రభువును మన హృదయములలో కలిగియుండుటయే! దేవుని ఆజ్ఞలలో ఒకదానికి అవిధేయులగుట కంటే మరణమును కోరుకొనునట్లు దేవుని పిల్లలను నడిపించునది ప్రేమే. యేసు ఇట్లనెను, "మీరు నన్ను ప్రేమించినయెడల నా ఆజ్ఞలను గైకొందురు" (యోహాను 14:15). అపొస్తలుడైన యోహాను ప్రేమను ఈ మాటలలో నిర్వచించెను, "మనమాయన ఆజ్ఞలను గైకొనుటయే దేవుని ప్రేమించుట; ఆయన ఆజ్ఞలు భారమైనవి కావు" (1 యోహాను 5:3).

కావున, అది దినమునకు సంబంధించిన ప్రశ్న కంటే మార్గమునకు సంబంధించినది. ప్రేమ ద్వారా విధేయత చూపించు మార్గమా, లేక ప్రేమ లేకపోవుట ద్వారా అవిధేయత చూపించు మార్గమా అనునది. దీనిని వ్రాసిపెట్టుకొనండి మరియు ఎన్నడును మరువకండి! దేవుని పట్ల ప్రేమ మరియు భక్తితో నిండిన హృదయమునుండి రానట్లయితే, విశ్రాంతిదినమును ఆచరించుట, అది నిజమైన ఏడవ దినపు విశ్రాంతిదినమైనను సరే, నిష్ఫలమైన క్రియయగును. ప్రేమ లేనియెడల, ఆజ్ఞలు పాటించుట అంతయు యాంత్రికముగాను మరియు దౌర్భాగ్యముగాను మారును, కానీ ప్రేమ ఉన్నయెడల, ప్రతి ఆజ్ఞ సంతోషముగాను మరియు ఆనందముగాను మారును. ఈ విధమైన వ్యక్తిగత ప్రేమ సంబంధమును మీ విశ్రాంతిదిన ఆచరణకు

పునాదిగా చేసికొనండి, అప్పుడు మీ జీవితాంతము విశ్రాంతిదినము మీ వారములోనే అత్యంత సంతోషకరమైన దినముగా ఉండును!

AMAZING FACTS
India

క్రింది వెబ్‌సైట్‌లోని మా ఉచిత

బైబిలు స్టడీ కోర్సును మిస్ అవ్వకండి

# BibleStudy.AFTV.in

ఈ రోజే నమోదు చేసుకోండి!

వేరు వేరు ఇతర అంశముల మీద సిద్ధాంతపరమైన తేడాలున్నప్పటికి, అనేకమంది క్రైస్తవులు విశ్రాంతి దినము అనునది క్రైస్తవ జీవితములో ఒక ప్రాముఖ్యమైన సమగ్ర భాగమని అంగీకరించుచున్నారు.

కాని ఏ దినమున మనము విశ్రమించవలసి యున్నాము?

# SabbathTruth.in

సబ్బాతు గురించి నీవు తెలుసుకోవాలని అనుకున్నది మొత్తము ఇక్కడున్నది.



AMAZING FACTS
India
Post Box No. 51 • Banjara Hills,
Hyderabad, TS, 500034
www.AmazingFactsIndia.org